సాక్షి
విజయనగరం

ఆదివారం । 2 । మార్చి । 2025



సహనం నేర్పే రంజాన్..

యావత్ ప్రపంచంలో ఉన్న ముస్లింలకు అత్యంత పవిత్రమైన, సంతోషాలు పంచే నెల రంజాన్.


- 8లో



పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

మన్యంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు.

- 8లో



ఇఫ్తార్	సహార్
ఆది (సా)	సోమ (ఉ)
6.08	4.51

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పుణ్యగిరి ఆదాయం రూ.15,08,067లు



పుణ్యగిరిలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది, భక్తులు

శృంగవరపుకోట: శివరాత్రి జాతర సందర్భంగా పుణ్యగిరి దేవస్థానంలోని హుండీల నుంచి రూ.6,14,418లు ఆదాయం సమకూరినట్టు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. పుణ్యగిరి శివాలయం, ధారగంగమ్మ ఆలయాల్లోని హుండీల ఆదాయాన్ని శనివారం లెక్కించారు. శివాలయంలోని హుండీల నుంచి రూ.5,73,327లు, ధారగంగమ్మ ఆలయంలోని హుండీల నుంచి రూ.42,091లు వచ్చిందన్నారు. విశిష్ట దర్శనం టికెట్ల విక్రయంతో రూ.1,46,250లు, శీఘ్రదర్శనం టికెట్ల వల్ల రూ.5,39.560లు, కేశఖండన టికెట్ల అమ్మకంతో రూ.12,840లు, లడ్డూ ప్రసాదాల వల్ల రూ.1,03,095లు, పులిహోర కౌంటర్ నుంచి రూ.67,200లు, విరాళాల రూపంలో రూ.24,706లు కలిపి శివరాత్రి జాతరకు రూ.15,08,067లు ఆదాయం సమకూరిందన్నారు. లెక్కింపు కార్యక్రమాన్ని ఈఓలు కె.నాగేంద్ర, జి.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలి



పార్కుగేట్ నుంచి గంటస్తంభం వరకు ర్యాలీ చేస్తున్న ఆటోయూనియన్ కార్మికులు

విజయనగరం టౌన్: అచ్యుతాపురంలో ఏర్పాటుచేసిన ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని వెంటనే ఎత్తివేయాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ అనుబంధం) ఆధ్వర్యంలో ఆటో కార్మికులు శనివారం ఆందోళన చేశారు. పార్కుగేట్ నుంచి గంటస్తంభం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ విజయదుర్గా ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సీలాపు అప్పలరాజురెడ్డి, రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ ఆర్టీఓ కార్యాలయ పనుల్లో దళారుల ప్రభావం లేకుండా చేయాలని ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటుచేశామని చెబుతున్నా.. రూ.860ల చలానాతో పాటూ అదనంగా రూ.3,300 చెల్లిస్తే ఫిట్‌నెస్ లేకపోయినా కంప్యూటర్‌లో పాస్‌చేసేస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేసే ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో చెన్నా ధర్మా, తర్లాడ శ్రీధర్, రాంబాబు, కృష్ణారావు, ఆటోడ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంతా మోసం

- కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను గాలికొదిలేసింది
- రాష్ట్ర బడ్జెట్‌లో సూపర్ సిక్స్‌కూ నిధులు కొరవడ్డాయి
- యువతకు నిరుద్యోగ భృతి లేదు... ఉద్యోగాలు రావు
- సాగునీటి ప్రాజెక్టులకూ అరకొరగానే నిధుల కేటాయింపు
- ఎనిమిది నెలల్లోనే లక్షా 10 వేల కోట్లకు పైగా అప్పులు
- మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

'చంద్రబాబు సహా టీడీపీ నాయకులది మాటల మాయాజాలం. బడ్జెట్‌లో అంకెల గారడీ. అరచేతిలో వైకుంఠం చూపించి తీరా అమలు దగ్గర కొచ్చేసరికి సంక్షేమ పథకాలకు ఎగనామం పెట్టడం అలవాటే. శుక్రవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌తో అది మరోసారి రుజువైంది' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయ కర్త, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నెక్కల నాయుడుబాబు, కె.వి.సూర్యనారాయణరాజు, నరసింహమూర్తితో కలిసి శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌పై అభిప్రాయం ఆయన మాటల్లోనే...

"టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పూర్తి నిరాశాజనకంగా ఉంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి అవసరమైన నిధులేవీ అందులో పొందుపర్చలేదు. సూపర్ సిక్స్ హామీలకూ పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదు. కేవలం ఒక మోసపూరితమైన బడ్జెట్‌ను అంకెల గారడీ చేసి ప్రవేశపెట్టారు. గత ఏడాది జూన్‌లో అధికారం చేపట్టిన తర్వాత ఓటాన్ బడ్జెట్‌తో కాలం నడిపించింది. కేవలం ఎన్నికల హామీలకు ఎగనామం పెట్టాలనే ప్రయత్నాలు అప్పటి నుంచే మొదలయ్యాయి. ఏ ఒక్క ఎన్నికల హామీనీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోయినా, క్యాపిటల్ వ్యయంతో అభివృద్ధి పథకాలు అమలుచేయకపోయినా సుమారు లక్షా పది వేల కోట్ల రూపాయలకు పైగా అప్పులు తెచ్చారు.

ఎందుకీ గొప్పలు

రాష్ట్రానికి ఆదాయ వనరులేమిటో బడ్జెట్‌లో చూపించలేదు. కేవలం అప్పులతోనే నెట్టుకొచ్చే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. క్యాపిటల్ వ్యయం గురించి ఆర్థిక మంత్రి గొప్పగా చెప్పారు. ప్రభుత్వం అప్పు తెచ్చినా లేదా కొత్త ఆదాయ మార్గాల నుంచి పెట్టుబడులు రప్పించి తద్వారా ఆదాయ వనరులు సమకూర్చేది క్యాపిటల్ వ్యయం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్యాపిటల్ వ్యయంతోనే రామాయపట్నం పోర్టు, మూలపేట పోర్టు, కృష్ణపట్నం పోర్టు సాకారం చేశాం. తీర ప్రాంతంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మత్స్యకారుల కోసం ఫ్లోటింగ్ జెట్టీలు పెట్టాం. అలాంటి అభివృద్ధి పనుల్లో ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇప్పటివరకూ పెట్టలేదు. మరి ఎలా ఆదాయం వస్తుంది? మరోవైపు ప్రభుత్వ ఆస్తుల పరాధీనం లేదా లీజుకు ఇచ్చే కార్యక్రమాన్ని శరవేగంగా తీసుకెళ్తున్నారు.

రైతులకు మొండిచేయి

రాష్ట్రంలో అత్యంత ప్రధానమైన వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికి సరైన దృక్కోణమే లేదు. ఏటా ప్రతి రైతు కుటుంబానికి రూ.20 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ పథకంలో ఇస్తామని ఊదరగొట్టిన టీడీపీ నాయకులు... ఇప్పుడు ఎక్కడ ఏ రైతులను ఆదుకున్నారో చెప్పలేని పరిస్థితి. రాష్ట్రంలో ఉన్న సుమారు 1.20 కోట్ల మంది రైతులకు ఈ బడ్జెట్‌లో అరకొర నిధులతోనే సరిపెట్టారు.

యువతకు ఉద్యోగాలేవీ...

యువతకు 20 లక్షల ఉద్యోగాలని హామీలిచ్చినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు. దావోస్ వెళ్లి తిరిగొచ్చినా ఒక లక్ష రూపాయల పెట్టుబడి కూడా వచ్చిన దాఖలాల్లేవు. శుక్రవారం ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో కూడా సూపర్ సిక్స్ హామీల నెరవేర్చడానికి అవసరమైన నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపించారు. ఆడబిడ్డ నిధి ప్రస్తావన లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రస్తావనా ఎక్కడా కనబడలేదు. యువతకు ఉద్యోగాలూ లేవు. నిరుద్యోగ భృతి గురించి మరచిపోయినట్లు నటిస్తున్నారు. ఇక బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అని చెప్పి ఇప్పుడు ఉన్నవాటిలోనే తొలగించే పనిలో ఉన్నారు. అమలుచేసింది ఏమైనా ఉందంటే రెండు నెలల నుంచి అమలుచేస్తున్న ఒకే ఒక్క పథకం భర్త చనిపోతే భార్యకు వితంతు పెన్షన్. కానీ అనేకమంది వితంతువులు పెన్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. గ్రామ, వార్డు వలంటీర్లకు రూ.10వేల గౌరవ వేతనం ప్రస్తావనే లేదు. వారిని కూటమి నాయకులు నిలువునా మోసం చేశారనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏమీ ఉండదు. ఒకపక్క డీఎస్సీ అన్నారు... జాబ్ క్యాలెండర్ తెస్తామన్నారు... కానీ ఒక్క ఉద్యోగం కూడా కొత్తగా ఇచ్చిన దాఖలాలు లేవు. అసెంబ్లీ వేదికగా గవర్నర్ ప్రసంగంలో 4 లక్షల ఉద్యోగాలు కల్పించామని చెప్పించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమం చేయడం శోచనీయం.

సాగునీటి వనరులపైనా చిన్నచూపే

సుమారు తోటపల్లి బ్యారేజ్ మిగులు పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రూ.140 కోట్లతో టెండర్లు పిలిచారు. ప్రభుత్వం మారేటప్పటికే 20 శాతం వరకు పనులు పూర్తి అయ్యాయి. ఇంకా 80 శాతం పనులున్నా ఈ బడ్జెట్‌లో కేవలం రూ.35 కోట్లు మాత్రమే కేటాయించారు. తారకరామ తీర్థ సాగరం ప్రాజెక్టు పూర్తిచేస్తే భోగాపురం విమానాశ్రయానికి అవసరమైన నీరే కాదు విజయనగరం పట్టణానికి పూర్తిస్థాయిలో తాగునీరు అందించవచ్చు. కానీ అరకొరగా నిధులు కేటాయించారు. ఈ ఏడాది అది పూర్తయ్యే పరిస్థితి లేదు. మరి 2026 నాటికల్లా నీరు రాకుండా ఎయిర్‌పోర్టును ఎలా ప్రారంభిస్తారు? ఎందుకు ప్రజలను మభ్యపెడతారు? జంఝావతి ప్రాజెక్టు, వెంగళరాయ సాగర్ పూర్తి చేస్తామని టీడీపీ మంత్రులు గొప్పలు చెప్పారు. కానీ బడ్జెట్‌లో అరకొరగా నిధులే విదిల్చారు. ఇక ఆంధ్ర రిజర్వాయర్, తాటిపూడి రిజర్వాయర్‌లను పూర్తిగా విస్మరించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను ఈ ప్రాంతానికి తీసుకురావాలని గత ప్రభుత్వంలోనే టెండర్లను పిలిచారు. భూసేకరణకు సర్వే కూడా జరిగింది. కానీ బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించలేదు. విజయనగరం ప్రాంతంలో ట్రైబల్ యూనివర్సిటీ, విశాఖ శివారులో ఐఎఎం శాశ్వత భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి. కానీ బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ఎస్.కోట ప్రాంతంలోని జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు పెట్టడానికి గత ప్రభుత్వంలోనే నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని అనుమతులు ఇచ్చారు. కానీ ఇప్పుడు బడ్జెట్‌లో కూడా వాటి ప్రస్తావన లేదు. చింతపల్లి తీరంలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి గత ప్రభుత్వంలోనే టెండర్లు పిలిచారు. దానికి సంబంధించి కూడా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదు. పార్వతీపురంలో మెడికల్ కాలేజీ ప్రస్తావన లేదంటే దానికీ మంగళం పాడేస్తున్నారని అర్థమవుతోంది.''



కెంగువ సచివాలయంలోనే పింఛన్లు అందజేస్తున్న సిబ్బంది

సచివాలయం వద్దే పింఛన్ల పంపిణీ

గజపతినగరం రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతినెలా 1వ తేదీన ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీధులు, రచ్చబండలు, సచివాలయాల్లోనే పింఛన్లు అందజేస్తున్నారు. మంచంపై ఉన్న వృద్ధులు సైతం అష్టకష్టాలు పడి పింఛన్ల పంపిణీ ప్రదేశానికి రావాల్సి వస్తోంది. గజపతినగరం మండలం కెంగువ గ్రామంలో శనివారం పలువురు లబ్ధిదారులకు సచివాలయంలోనే పింఛన్లు అందజేశారు. ఇదే విషయాన్ని ఎంపీడీఓ కల్యాణి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేయాలని, లబ్ధిదారులు అభీష్టం మేరకు ఒకేచోట ఇవ్వవచ్చన్నారు. సిగ్నల్ లేని ప్రాంతాల్లో సచివాలయంలో కూడా ఇవ్వవచ్చని చెప్పుకొచ్చారు.



ఇంటర్మీడియట్ పరీక్షకు ట్రైసైకిల్‌పై హాజరైన దివ్యాంగురాలు రుహానీ

ఇంటర్ తొలిరోజు పరీక్ష ప్రశాంతం

- పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ అంబేడ్కర్



విజయనగరంలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థులకు తొలిరోజు శనివారం నిర్వహించిన తెలుగు, సంస్కృతం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 18,686 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 18,178 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుల్లో 2,980 మందికి 2,596 మంది హాజరైనట్టు ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు. కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజయనగరం పట్టణంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాల తనిఖీ చేశారు. అక్కడి వసతులను, వైద్య, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. కొన్ని చోట్ల తరగతి గదుల్లో వెలుగు తక్కువగా ఉండడంతో వెంటనే లైటింగ్ ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సీటింగ్ విధానాన్ని మార్చాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ కూర్మనాథరావు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ గుట్టు రట్టు అయ్యేనా?

- మద్యం షాపు లైసెన్స్‌దారుల నుంచి అక్రమ వసూళ్లపై ఆరా
- ఒక్కో సీఐ పరిధిలో ఇద్దరేసి చొప్పున లైసెన్స్‌దారులకు పిలుపు
- డీసీ కార్యాలయంలోనే గుట్టుగా విచారణ



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఎక్సైజ్ శాఖలో భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడిన ఓ ఉన్నతాధికారి గురించి గుట్టుగా విచారణ ప్రారంభించినట్లు తెలిసింది. విజయనగరంలోని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి విచారణ సాగింది. జిల్లాలో ఒక్కో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో ఇద్దరేసి మద్యం షాపు లైసెన్స్‌దారులను రప్పించి విచారణ జరిపారు. ఇదే అదనుగా విచారణలో ఏం చెప్పాలో ఆయా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సదరు మద్యం షాపుల లైసెన్స్‌దారులకు ముందుగానే బెదిరించి మరీ ట్రెనింగ్ ఇచ్చినట్లు తెలిసింది. అలా సదరు ఉన్నతాధికారిపై ఈగ కూడా వాలకుండా జాగ్రత్త పడ్డారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉభయ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో మద్యం షాపుల లైసెన్స్‌దారుల నుంచి మామూళ్లు వసూలు చేసిన వ్యవహారాన్ని గత జనవరి నెలలో 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఎక్సైజ్ శాఖలో ఓ ఉన్నతాధికారి రెండు జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు రూ.4 కోట్ల వరకూ వసూలు చేయాలని టార్గెట్ పెట్టిన విషయాన్నీ బహిర్గతం చేసింది. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. అందులో భాగంగానే అడిషనల్ డైరెక్టర్ దేవకుమార్ విజయనగరం వచ్చారు. డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలోనే విచారణ ప్రారంభించారు. ఒక్కో సీఐ ఇద్దరేసి చొప్పున మద్యం దుకాణాల లైసెన్స్‌దారులను తీసుకురావాలని చెప్పడంతో జిల్లా అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. విచారణకు హాజరైన లైసెన్సీలు ఏం చెప్పారనేదే ఇప్పుడు కీలకంగా మారింది.

పింఛన్ కోసం పడిగాపులు



విజయనగరం లెంక వీధిలో..



కుమ్మరివీధిలో ఇలా..

గతంలో ఒకటో తేదీ వచ్చిందంటే లబ్ధిదారుల ఇంటి తలుపుతట్టి వలంటీర్ పింఛన్ డబ్బులు అందజేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వలంటీర్ల సేవలు దూరమయ్యాయి. సచివాలయ సిబ్బందే పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. సిబ్బంది తక్కువగా ఉండడంతో పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతోంది. విజయనగరం జిల్లాలో చాలా చోట్ల శనివారం ఉదయం 8 గంటలైనా పింఛన్లు ఇచ్చేవారు రాకపోవడంతో వృద్ధులు ఎదురుచూశారు. విజయనగరంలోని లెంకవీధి, జొన్నగుడ్డి, కుమ్మరవీధిలో కనిపించిన ఈ చిత్రాలే సజీవ సాక్ష్యం.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



జొన్నగుడ్డిలో...

భిన్నకళా సంప్రదాయాల నిధి..

గిరిజన చిత్రకళ



గిరిజన కళాకారులతో కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి, కువెంపు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ శరత్ అనంతమూర్తి

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి
- జాతీయ గిరిజన చిత్రకారుల సమ్మేళనం



వాల్మీకి ట్రైబల్ ఆర్ట్స్ అరకు కళాకారుల ప్రదర్శన



రాజస్థాన్ ఆర్ట్స్

విజయనగరం అర్బన్: దేశంలో గిరిజన చిత్రకళ.. భిన్న కళా సంప్రదాయాలకు నిధి అని, చిత్రకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ఫొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. వర్సిటీ, మాన్సాస్ విద్యాసంస్థలు సంయుక్తంగా 'నేషనల్ ట్రైబల్ పెయింటర్స్ కాన్‌క్లేవ్' పేరుతో రెండు రోజుల పాటు విజయనగరం కోటలోని రౌండ్ మహల్‌లో నిర్వహించనున్న గిరిజన చిత్రకారుల సమ్మేళనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశం కళలకు నిలయమని, వివిధ రాష్ట్రాల్లో వివిధ ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, పద్ధతులు, కళలు విస్తరించి ఉంటాయన్నారు. స్వదేశీ కళారూపాలను ప్రోత్సహించడానికి భారతదేశం అంతటా ఉన్న గిరిజన చిత్రకారులను ఒక వేదికపైకి తేవడం సంతోషంగా ఉందన్నారు. గిరిజన చిత్రాలను, కళలను గౌరవించడమే దీని ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. కర్నాటక రాష్ట్రం శివమొగ్గలోని కువెంపు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ శరత్ అనంతమూర్తి మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన వ్యవస్థలో అంతర్భాగమైన గిరిజన కళ ప్రాముఖ్యతను వ్యక్తీకరించి గౌరవించాలన్నారు. తొలుత జ్యోతిప్రజ్వలనలో మాన్సాస్ చైర్మన్ పి.అశోక్‌గజపతిరాజు, గోండ్ చిత్రకారిణి, ప్రద్మశ్రీ పురస్కార గ్రహీత దుర్గాబాయి పాల్గొన్నారు. ప్రదర్శనలో గోండ్, వార్లీ, పిథోర, కోలం, సోహ్రయ్, ఖోవర్, కోయా, కురుంబా, తంగ్‌ఖుల్–నాగా, నాయకపోడు, సవర, సౌరా, మురియా, భిల్ వంటి విభిన్న కళారూపాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాన్సాస్ కరస్పాండెంట్ డాక్టర్ కేవీఎల్ రాజు, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డాక్టర్ బీఎస్ఎన్ రాజు, గిరిజన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, డాక్టర్ చితేంద్రమోహన్ మిశ్రా, వివిధ విభాగాల డీన్‌లు, అధిపతులు అనిరుద్‌కుమార్, వెంకటేశ్వర్లు, నగేష్, దేబంజన నాగ్, కె.దివ్య, ఎస్.వి.ఎస్.సూర్యనారాయణ, ఎం.జి.నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం గిరిజన సంప్రదాయక సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహుతులను అలరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 98 శాతం ఉత్తీర్ణత

విజయనగరం అర్బన్: డిగ్రీ వార్షిక పరీక్షల్లో విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ కే.రేఖ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ శనివారం విడుదల చేసిన డిగ్రీ పరీక్షల ఫలితాల వివరాలను ఆమె విలేకరులకు తెలియజేశారు. పరీక్షల్లో బీఏ, బీకామ్ విద్యార్థులు శతశాతం, బీఎస్సీ బీజెడ్‌సీ విద్యార్థులు 92 శాతం, బీఎస్సీ ఎంపీసీ విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. బీఎస్సీ బీజెడ్‌సీలో సారికా అనూష 9.2 ఎస్‌పీజీఏ పాయింట్లు, బీఏలో అభిషేక్ బైద్య, సూర్యనంద ప్రకాష్‌కు 8.5 ఎస్‌పీజీఏ పాయింట్లు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు, అధ్యాపకులు అభినందించారు.

విజ్ఞానం పెంపొందించిన సైన్స్ దినోత్సవం



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న డీఈఓ యు.మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: విజయనగరం కంటోన్మెంట్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ దినోత్సవం విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించింది. ప్రతిభను ప్రదర్శించేందుకు వేదికగా నిలిచింది. 'ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్' అనే అంశంపై విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్, సెమినార్ పోటీలను శనివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 27 మండలాల నుంచి క్విజ్ పోటీలకు 63 మంది, సెమినార్ పోటీలకు 25 మంది హాజరయ్యారు. విజేతలకు డీఈఓ యు.మాణిక్యంనాయుడు, ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు కె.వి.రమణ, కె.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

క్విజ్ సీనియర్ విభాగం:

ప్రథమ స్థానం: టీకే అన్నపూర్ణేశ్వరి (బాలికల ఉన్నత పాఠశాల, విజయనగరం), హేమలత (కేజీబీవీ, జామి), బండారు కీర్తన (జెడ్పీహెచ్ఎస్ గుర్ల), సంగిరెడ్డి హైమ (జెడ్పీహెచ్ఎస్ గురడబిల్లి), మద్దిల మోక్ష (జెడ్పీహెచ్ఎస్ అరసాడ).

ద్వితీయ స్థానం: సీహెచ్ సూర్యప్రకాష్ (జెడ్పీహెచ్ఎస్ గరివిడి), ఆర్.శివ (ఏపీమోడల్ స్కూల్, మేడపల్లి), జి.నేత్రాదేవి (జెడ్పీహెచ్ఎస్ గుర్ల), ఎల్.నిత్యసారథి (జెడ్పీహెచ్ఎస్, గరివిడి), ఐ.వైష్ణవి (జెడ్పీహెచ్ఎస్, కొట్యాడ).

క్విజ్ జూనియర్ విభాగం:

ప్రథమ స్థానం: కే.జనని (ఏపీమోడల్ స్కూల్, గర్భాం), ఎల్.ఇందుమతి నాయుడు (జెడ్పీహెచ్ఎస్, అరసాడ).

ద్వితీయ స్థానం: జి.మోహిత్ కుమార్ (ఏపీమోడల్ స్కూల్, పెదమేడపల్లి), వై.జ్ఞాన వైష్ణవి (ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల, గజపతినగరం).

సెమినార్ పోటీలు: కె.కీర్తన (కొత్తవలస), ఎం.కీర్తి (తెర్లాం), ఎస్.వైష్ణవి (గంట్యాడ)లు వరుస మూడుస్థానాల్లో నిలిచారు. వి.అవినాష్ (బొబ్బిలి), యు.చరిష్మ (వేపాడ) ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు.

క్లుప్తంగా

క్యాంపస్ ఇంటర్వ్యూలు రేపు

బొబ్బిలి: పట్టణంలోని రాజా కాలేజ్‌లో దివిస్ ల్యాబ్స్ కంపెనీ ప్రతినిధులు సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని ప్రిన్సిపాల్ సీహెచ్ వీరేంద్రకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ లేదా ఎనలటికల్ కెమిస్ట్రీ, బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, బి ఫార్మసీ కోర్సులు చేసిన పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 2000- 2005 సంవత్సరాల మధ్య విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, బయోడేటా, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని నేరుగా కళాశాలలో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

యువకుడిపై కేసు నమోదు

పార్వతీపురం రూరల్: పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న ఓ అమ్మాయి ఇంటికి వెళ్లి దాడి చేసిన అబ్బాయిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కె. మురళీధర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురానికి చెందిన అమ్మాయి తన చుట్టాలబ్బాయితో కొమరాడ మండలంలోని గుంప వెళ్లి వస్తుండగా.. శివిని గ్రామం వద్ద నిందితుడు వాళ్ళిద్దర్నీ అడ్డుకొని తాను ప్రేమించిన అమ్మాయితో నీకేంటి పని అని గద్దిస్తూ చుట్టాలబ్బాయిని బెదిరించాడు. అక్కడితో ఆగకుండా అమ్మాయి ఇంటికి వెళ్లి దుర్భాషలాడుతూ అమ్మాయిపై చేయి చేసుకున్నాడు. ఈ మేరకు అమ్మాయి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి

- డీపీఓ వెంకటేశ్వరరావు



సేంద్రియ ఎరువు తయారీపై సూచనలు చేస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

రాజాం సిటీ: గ్రామాల్లో ఏర్పాటు చేసిన సంపద సృష్టి కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువు తయారీపై దృష్టి సారించాలని డీపీఓ వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని సోపేరు గ్రామంలో శనివారం ఆయన పర్యటించి, వర్మీకంపోస్టు తయారీపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో క్లాప్‌మిత్రలు సేకరించిన తడి, పొడి చెత్తను కేంద్రంలో పూర్తిగా వేరు చేయాలని సూచించారు. తడిచెత్తను బయట ఏర్పాటు చేసిన పిట్స్‌లో వేయాలని, పొడి చెత్తను కేంద్రం లోపల డ్రై పిట్స్‌లో వేయాలన్నారు. ప్రతి ఒక్క పంచాయతీలో సంపద సృష్టిపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ పట్నాయక్, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని ఫైర్ స్టేషన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మున్సిపాల్టీ పరిధి వస్త్రపురి కాలనీకి చెందిన ఆగూరు తిరుపతిరావు అనే వృద్ధుడు సైకిల్‌పై అమ్మవారి గుడి సమీపంలోని యోగాశ్రమానికి వెళ్తున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన మోటార్‌సైక్లిస్ట్ ఢీ కొనడంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి అతడ్ని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. క్షతగాత్రుడి అన్నయ్య ఆగూరు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు.

స్వగ్రామానికి ఎంటెక్ విద్యార్థి మృతదేహం

- మూడు రోజుల కిందట సూరత్‌లో జరిగిన ప్రమాదంలో మృతి



పత్తిగిడి నాగరాజు(ఫైల్)

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పూతికపేట గ్రామానికి చెందిన యువకుడు పత్తిగిడి నాగరాజు (25) గత నెల 27న గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. అక్కడి రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని సెల్‌ఫోన్ ఆధారంగా స్నేహితులకు సమాచారం అందించారు. వెంటనే వారు కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో హైదరాబాద్‌లో ఉన్న మృతుడి అన్నయ్య చిరంజీవి సూరత్ వెళ్లి మృతదేహాన్ని స్వగ్రామమైన పూతికపేట గ్రామానికి శనివారం తీసుకువచ్చారు. నాగరాజు ఐదు నెలల కిందటే సూరత్‌లోని ఎస్ఐటీలో ఎంటెక్ చేసేందుకు వెళ్లాడు. తమ కుమారుడు తరుచూ ఫోన్‌లో మాట్లాడుతుండేవాడని, ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండే యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు శోక సంద్రంలో మునిగిపోయారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	200

సహనం నేర్పే రంజాన్..

- నేటి నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం
- నెల రోజుల పాటు కఠిన దీక్షలు, దానధర్మాలు
- ప్రార్థనలకు ముస్తాబైన మసీదులు



మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

విజయనగరం టౌన్: యావత్ ప్రపంచంలో ఉన్న ముస్లింలకు అత్యంత పవిత్రమైన, సంతోషాలు పంచే నెల రంజాన్. ఈ నెల అరబీ నెలల వరుస క్రమంలో తొమ్మిదవది. రంజాన్ అంటే కాలిపోవడం, భస్మీపటలమవ్వడం, ఆగిపోవడం అనే అర్థాలను సూచిస్తుంది. రంజాన్ నెలలో తమ పాపాలు, పొరపాట్లు, తప్పిదాలన్నీ కాలిపోయి వాటికి బదులుగా పుణ్యఫలాలు పొందుతామనేది ముస్లింల నమ్మకం. ఈ శుభాల సరోవరం, వరాల వసంతం అయిన రంజాన్ మాసం నెల వంకను చూసిన వెంటనే ప్రారంభమవుతుంది. ఈ నెలకు అల్లాహ్ దృష్టిలో పవిత్రమైన, ప్రత్యేకమైన స్థానముంది. విశ్వాసులకు ఎనలేని సంతోషాలు, పుణ్యాలను అందిస్తుంది ఈ మాసం. ప్రపంచ వ్యాప్తంగా చిన్న పిల్లలు మొదలుకుని వృద్ధుల వరకు ఈ పవిత్రమాసం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఉంటారు. ఆదివారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభించాలని జమాతే ఇస్లామీ హింద్ సంస్థ మతాధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రార్థనలకు మసీదులన్నీ విద్యుత్ అలంకరణలతో ముస్తాబయ్యాయి.



నెలవంక



ప్రార్థనలకు సిద్ధమవుతున్న జామియా మసీదు

ఆలయ కమిటీల ప్రతినిధులు అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

ఉచితంగా నమాజ్ పుస్తకాల పంపిణీ...

రంజాన్ మాసంలో ఉచితంగా నమాజ్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు పట్టణ ముస్లిం ప్రతినిధి మహమ్మద్ గౌస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన గ్రామాలు, మండలాల్లో 38 వేల నమాజ్ పుస్తకాలను పంపిణీ చేపట్టనున్నామన్నారు. అవకాశం ఉన్నవారందరూ పుస్తకాలను స్వీకరించాలని కోరారు.

ఈ నెల ప్రత్యేకతలు

- 30 రోజుల పాటు ప్రపంచంలో ముస్లింలందరూ ఉపవాస దీక్షలు పాటిస్తారు.
- మానవుల మార్గదర్శక గ్రంథం, చివరి దైవ గ్రంథం దివ్య ఖురాన్ అవతరించింది ఈ నెలలోనే. దీనికి కృతజ్ఞతగానే ముస్లింలు ఉపవాసాలు పాటిస్తారు.
- ఈ నెలలో చేసే ప్రతి చిన్న పుణ్యకార్యానికీ 70 రెట్ల నుంచి 700 రెట్ల పుణ్యం లభిస్తుంది.
- దైవత్వం ఈ నెలలో నరక ద్వారాలను మూసివేయిస్తారని, స్వర్గ ద్వారాలను మాత్రమే తెరిచి ఉంచుతారని, సైతాన్‌లను బంధిస్తారని ముస్లింల నమ్మకం.
- పేదలు, అవసరార్థులు, వితంతువులు, అనాథలు, బాటసారులకు సేవా కార్యక్రమాలు చేపడతారు.

పాపాల నుంచి రక్షించుకునే అవకాశం



మనిషి తాను చేసిన పాపాల నుంచి రక్షించుకునే అవకాశం భగవంతుడు కల్పించాడు. ఖురాన్ పఠనం ద్వారా ప్రతి ముస్లింలో వ్యక్తిత్వ వికాసం జనిస్తుంది. రంజాన్ నెల దైవభీతి, నైతికత, సహన గుణం నేర్పిస్తుంది. ఈ నెల మిగతా 11 నెలలకు ఒక శిక్షణా కాలం వంటిది. ఖురాన్ పఠిస్తూ ఇతరులకు సేవ చేయాలి. ఈ నెలలో లభించిన సుగుణాలు మిగతా నెలల్లో వికసిస్తాయి. **– మహ్మద్ హబీబ్, జమాతే ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు, విజయనగరం**

అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు



రంజాన్ మాసం ప్రారంభం కావడంతో అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తాం. దేశం అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చెందాలని, ముస్లిం సోదరులందరూ ప్రత్యేక నమాజ్‌లు చేయనున్నారు. పవిత్ర ఖురాన్ గ్రంథం చదవడం, ఉపవాస దీక్షలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. **– అబ్దుల్ కరీమ్, వక్ఫ్‌బోర్డ్ మాజీ అధ్యక్షుడు, విజయనగరం**

ఉమెన్ హెల్ప్‌డెస్క్‌లుగా రిసెప్షన్ కౌంటర్లు

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్ స్టేషన్‌లలో ఉన్న రిసెప్షన్ కౌంటర్లు ఇకపై ఉమెన్ హెల్ప్ డెస్క్‌లుగా మారుస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షనిస్టులుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ఉమన్ హెల్ప్ డెస్క్‌కు ఒక మహిళా ఏఎస్సై, హెచ్‌సీ, మహిళా పీసీలను నియమిస్తామన్నారు. బాధితులు ఫిర్యాదు రాయలేకపోతే సిబ్బందే వారి ఫిర్యాదులను రాయాలని సూచించారు. ఫిర్యాదు తీసుకున్న తర్వాత ఆయా అంశాలను రిసెప్షన్ రిజిస్టర్‌లో నమోదు చేసి బాధితులకు రశీదు ఇవ్వాలన్నారు. అనంతరం విషయాన్ని స్టేషన్ హౌస్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెల్ప్ డెస్క్‌కు నియమించిన సిబ్బంది ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 వరకు అందుబాటులో ఉండాలన్నారు. గొడవల కారణంగా బాధితులు ఎవరైనా తిరిగి ఇంటికి వెళ్లలేని పరిస్థితుల్లో ఉంటే వారిని స్వధార హోమ్, వన్‌స్టాప్ సెంటర్‌లో ఆశ్రయం కల్పించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, వన్‌స్టాప్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన ఎస్‌హెచ్‌ఓలు, హెల్ప్‌డెస్క్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పొట్టేళ్ల పందాలపై దాడులు



పట్టుకున్న పొట్టేలుతో పోలీసులు

వీరఘట్టం: మండలంలోని కడకెల్ల గ్రామ శివారులో జరుగుతున్న పొట్టేళ్ల పందాలపై శనివారం తెల్లవారుజామున ఎస్సై జి.కళాధర్ సిబ్బందితో కలిసి దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా ముగ్గురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు ఒక పొట్టేలు, రూ. 1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం

- రూ. 3 లక్షల ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పూరిల్లు

వీరఘట్టం: మేజర్ పంచాయతీ పరిధి దుర్గగుడి సమీపంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ధర్మవరపు పార్వతికి చెందిన పూరిల్లు అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో రూ. 1.50 లక్షల నగదుతో పాటు పది కోళ్లు, టీవీ, ఫ్యాన్లు, బీరువా, నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి. ఒక్కసారిగా వ్యాపించిన మంటలను చూసి స్థానికులు పాలకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక అధికారి జామి సోమేశ్వరరావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు మూడు లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని అంచనా వేశారు.

నిప్పంటుకుని వృద్ధురాలి మృతి



బండమ్మ (ఫైల్)

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని గొట్నంది గ్రామానికి చెందిన బొడ్డు బండమ్మ (66) శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందింది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బండమ్మ నులక మంచంపై పడుకుని కిందన అగ్గి కుంపటి పెట్టుకుని నిద్రలోకి జారుకుంది. దీంతో కుంపటి నుంచి మంటలు వ్యాపించడంతో మంచం కాలిపోయి బండమ్మ తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు స్పందించి బండమ్మను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. బండమ్మ కుమారుడు పెదబండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షణికావేశంలో వ్యక్తి ఆత్మహత్య



రమణ (ఫైల్)

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు గ్రామానికి చెందిన సంచాన రమణ (39) శుక్రవారం సాయంత్రం తన ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నాడు. గరివిడి పోలీసులు శనివారం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రమణ తొమ్మిదో తరగతి చదువుతున్న తన కుమార్తె శ్యామలను మందలిస్తూ చేయి చేసుకున్నాడు. దీంతో అతని భార్య కమల కుమార్తెను ఎందుకు కొట్టావని ప్రశ్నించింది. దీంతో మనస్తాపానికి గురైన రమణ ఇంటిలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రమణ పైడిభీమవరం కంపెనీలో లేబర్‌గా పనిచేస్తుండగా.. అతని భార్య కమల అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెమికల్ తాగి వ్యక్తి మృతి..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కోడూరు పంచాయతీ పరిధి వైఎస్సార్ కాలనీకి చెందిన పిన్నింటి పాపారావు (50) నీరు అనుకుని పొరపాటున అరటిపండ్లు మగ్గించే రసాయనం తాగి మృతి చెందాడు. గరివిడి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాపారావు వైఎస్సార్ కాలనీలో గల తన ఇంటిలో పడుకుని శనివారం సాయంత్రం నిద్ర లేచాడు. ఈ క్రమంలో దాహంగా ఉండడంతో ఎదురుగా వాటర్ బాటిల్‌లో అరటిపండ్లను మగ్గించేందుకు ఉంచే రసాయనాన్ని నీరు అనుకుని తాగేశాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకున్న పాపారావును కుటుంబ సభ్యులు చీపురుపల్లి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేయగా.. చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. మృతుని కుమారుడు పిన్నింటి రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగభూషణం మృతదేహం

శృంగవరపుకోట: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. పట్టణంలోని గౌరీనగర్‌కు చెందిన సరిత నాగభూషణం(55) అనే ఉదయం 8.30 గంటల సమయంలో కొత్తవలసలోని కుమార్తె ఇంటికి వెళ్లాలని బయటకు వచ్చాడు. రైతుబజార్‌లో కూరగాయలు కొనుగోలు చేసి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు నడిచి వెళ్తుండగా.. అప్పుడే యూ టర్న్ తీసుకున్న ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు నాగభూషణంను ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన నాగభూషణంను ప్రభుత్వాస్పత్రికి హుటాహుటిన తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడి భార్య విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్..



శివగణేష్ మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి, భార్య, బంధువులు



మృతుడు శివగణేష్ (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన ఉదయాన శివగణేష్(28) అనే ట్రాక్టర్ డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు, అతని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యక్తిగత పనిమీద శివగణేష్ శనివారం ఉదయం వీరఘట్టం బయలుదేరాడు. ఇదిలా ఉంటే వీరఘట్టం హైస్కూల్ ఎదురుగా ఉన్న మెకానిక్ షెడ్డు వద్ద కృష్ణ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించుకుని వీరఘట్టం వైపు వస్తున్నాడు. ఇంతలో శివగణేష్ వీరఘట్టం వెళ్లేందుకు అతనికి లిఫ్ట్ అడిగాడు. తెలిసిన వ్యక్తి కావడంతో కృష్ణ అతనికి ట్రాక్టర్ ఎక్కమనగా.. శివగణేష్ ఇంజిన్‌కు ట్రాక్టర్ తొట్టికు మధ్య రాడ్డుపై ఎక్కాడు. సరిగ్గా తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సీసీ రోడ్డు వద్దకు వచ్చేసరికి శివగణేష్ అదుపుతప్పి పడిపోవడంతో, తొట్టి చక్రాలు అతని తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్సై జి.కళాధర్ సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు.మృతుడి తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రమ్య, ఏడాదిన్నరలోపు ఇద్దరు పిల్లలు, తల్లి రాజేశ్వరి ఉన్నారు.

పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు



జగతపల్లి వ్యూపాయింట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సీతంపేట: మన్యంలో పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రదేశాలను శనివారం ఆయన సందర్శించారు. జగతపల్లి వ్యూ పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. పర్యాటకులను ఆకర్షించే విధంగా వ్యూ పాయింట్‌ను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పనుకువలస నర్సరీలో గ్రామదర్శిని కార్యక్రమం ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించి ఇక్కడ అనుకూలంగా ఉందన్నారు. గడిగుడ్డిలోని పట్టు పరిశ్రమ యూనిట్‌ను పరిశీలించారు. పట్టునుంచి దారం తీసే విధానాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పెదరామ గ్రామంలో మల్బరీ తోటలు పెంచే రైతులతో మాట్లాడారు. ఐటీడీఏలోని ముక్కిడిపోలమ్మ జీడి ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలించారు. కొండచీపుర్లు, అగరుబత్తి యూనిట్, పసుపు ప్రాసెసింగ్ కేంద్రాలను సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, ఏపీఓ చిన్నబాబు, డీడీ అన్నదొర, ఈఈ రమాదేవి, ఎంపీడీఓ గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

ఇది మోసపూరిత బడ్జెట్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, తదితరులు

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

వంగర: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తి మోసపూరితంగా ఉందని.. ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన మాటలకు, ఇప్పుడు బడ్జెట్‌లో కేటాయింపులకు పొంతనే లేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోవడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని మండిపడ్డారు. మండలంలోని కోనంగిపాడులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గతేడాది సూపర్ సిక్స్ పథకాల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని.. ఈ ఏడాది బడ్జెట్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొర నిధులు కేటాయించడం చూస్తుంటే.. ఆ పథకాల అమలుపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. ఫ్రీ బస్, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పథకాలకు కేటాయింపులు లేకపోవడం అన్యాయమన్నారు. 50 ఏళ్ల పైబడిన బీసీలకు పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. ప్రజలు సీఎం చంద్రబాబును నమ్మి మోసపోయారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని.. పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలు దేశంలో ఎక్కడా ప్రవేశపెట్టలేదని తెలిపారు. ఆరోగ్యశ్రీని ఎన్టీఆర్ వైద్యసేవగా పేరుమార్చి పథకాన్ని పూర్తిగా నీరుగార్చారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా తీసుకెళ్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం రెవెన్యూ వ్యయం కింద రూ.2.51 లక్షల కోట్లు కేటాయించి, మూలధన వ్యయం కింద కేవలం రూ.40 వేల కోట్ల కేటాయింపులు చేయడమే వారి మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయిందని తెలిపారు. తన మంత్రి పదవిని కాపాడుకునేందుకే పయ్యావుల కేశవ్ బడ్జెట్ సమావేశాల్లో చంద్రబాబు, లోకేష్‌లను పొగిడే దుస్థితికి దిగజారారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, సర్పంచ్‌లు చందక తాతబాబు, నెయిగాపుల శివరామకృష్ణయ్య, పార్టీ నాయకులు కనగల పారినాయుడు, వేమిరెడ్డి సూర్యనారాయణ, బెవర నూకం నాయుడు, యలకల వాసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏడో తేదీ వరకు మహిళా సాధికారత వారోత్సవాలు

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి ఒకటో తేదీ నుంచి ఏడు వరకు జిల్లాలో మహిళా సాధికారత వారోత్సవాలు నిర్వహిస్తామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థినులు, మహిళల భద్రత.. పోలీస్ విధులపై అవగాహన కల్పించేందుకు 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారోత్సవాల్లో భాగంగా మెడికల్ క్యాంపులు, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఓపెన్ హౌస్, ర్యాలీ కూడా చేపడతామని చెప్పారు. మహిళల భద్రత, రక్షణ, సమానత్వం, అభివృద్ధి, సాధికారతకు కృషి చేయాలన్న సంకల్పంతో జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు.

ఆయుధాల ప్రదర్శన..

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఓపెన్‌హౌస్ కార్యాక్రమంలో భాగంగా పోలీసులు ఆయుధాలు ప్రదర్శించారు. తుపాకులు, బాంబ్ డిస్పోజల్స్ పరికరాలు, పోలీస్ డాగ్స్, డ్రోన్స్, సాంకేతికత, బాడీ వోర్న్ కెమెరాలు, ట్రాఫిక్, కమ్యూనికేషన్ విభాగాల్లో వినియోగిస్తున్న పరికరాలు ప్రదర్శించి, వాటి పనితీరును వివరించారు. అలాగే నేర స్థల పరిశీలనలో క్లూస్ టీమ్ ఆధారాలు, ఫింగర్ ప్రింట్స్ పని తీరుపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, మహిళా పీఎస్ సీఐ ఈ.నర్సింహమూర్తి, వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు, ఆర్ఐలు ఎన్. గోపాలనాయుడు, ఆర్.రమేష్కుమార్, టి.శ్రీనివాసరావు, ఏఆర్, సివిల్ పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.